## క్లుప్తంగా

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి

**బిజినేపల్లి:** అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ మండల సీనియర్ నాయకుడు మంగంపేట శ్రీనివాసులు, ఈర్ల భూపేష్ బాబు కోరారు. బుధవారం ఎంపీడీవో కథలప్పకు వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొంత మంది పేదల ఇళ్లు కూలా యని బాధితుల ఇళ్లను పరిశీలించి వారికి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని వివరించారు. నాయకులు మోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### బీసీ బంద్‌కు మద్దతు

**బిజినేపల్లి:** బీసీలకు రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18వ తేదీన బీసీ సంఘాలు ఇచ్చిన బంద్‌కు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందని మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్‌బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బీసీలకు భవిష్యత్తులో చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మంగంపేట శ్రీనివాసులు, శ్రీనివాసులు, మల్లకేడి శ్రీనివాసులు, మోహన్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

### విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**కల్వకుర్తి రూరల్:** విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని బీఆర్‌ఎస్వీ మండల శాఖ అధ్యక్షుడు గణేష్ దారమోని అన్నారు. బుధవారం ఆశ్రమం పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు సరైన భోజనం లేకపోవడంతో చాలామంది ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. పాఠశాలలో పనిచేసే వర్కర్లు కొన్ని రోజులుగా సమ్మె చేస్తుండడంతో సమస్య తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో సుశీల, శేఖర్ గౌడ్, రవి, కేశవులు, శ్రీరాములు పాల్గొన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష, జరిమానా

**కల్వకుర్తి టౌన్:** డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు కూడళ్లలో మంగళవారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మండలంలోని ముకురాలకు చెందిన పరశురాములు పట్టుబడ్డాడు. బుధవారం కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా కేసును జడ్జి కావ్య పరిశీలించి నిందితుడికి ఒకరోజు జైలుశిక్షతో పాటుగా రూ.600 జరిమానాను విధించారు.

### అన్నిరంగాల్లో అభివృద్ధి

**అమ్రాబాద్:** అమ్రాబాద్, పదర మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండలంలోని మొల్కమామిడి గ్రామ సమీపంలో 220/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తైతే రెండు మండలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, హరినారాయణగౌడ్, తహసీల్దార్ శైలేంద్రబాబు, డీఈ శ్రీధర్, ఏడీఏ అంజనేయులు, ఏఈ రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**తెలకపల్లి:** ఆర్టీసీ డ్రైవర్ శ్రీశైలం హైదరాబాద్‌లోని తార్నాక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ శ్రీశైలం మృతి చెందాడు. దీంతో బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బాధిత కుటుంబసభ్యులు, ఆందోళన చేపట్టారు. అచ్చంపేట డిపో మేనేజర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైటాయించి డీఎం రావాలంటూ పట్టుబట్టారు. ఎస్ ఐ నరేష్ ఘటన స్థలానికి చేరుకొని డీఎంతో మాట్లాడారు. అన్నివిధాలా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

### చైన్‌స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

**తిమ్మాజిపేట:** చైన్ స్నాచింగ్ కేసును ఒకరోజు వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. బుధవారం ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13న మారేపల్లి గ్రామానికి చెందిన మంగళి మనెమ్మ మెడలో ఉన్న పుస్తెల తాడును పోలేపల్లి గ్రామానికి చెందిన కందూరి విష్ణు లాక్కొని వెళ్లాడు. దీంతో బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డ వద్ద దొంగను గుర్తించి పట్టుకునట్లు తెలిపారు. నిందితుడి నుంచి కొంత నగదుతో పాటు బైక్ స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కేజీబీవీలో మెరుగైన విద్య

**పెద్దకొత్తపల్లి:** కేజీబీవీ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో భోజనం, వంట గదిని, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.



# క్రీడలతో ఉజ్వల భవిష్యత్



వాలీబాల్ క్రీడాకారులను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్:** క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఇటీవల జడ్చర్ల బాదేపల్లి వేదికగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్–17 వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైన నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా పోటీలు ప్రతిభను వెలికితీసేందుకు దోహదం చేస్తాయని వివరించారు. మానసికోల్లాసంపాటు శారీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. ప్రతి పాఠశాలలో క్రమం తప్పకుండా క్రీడలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వరప్రసాద్, నితిన్, రఘువీర్, శ్రీలేఖ, మైత్రి, ప్రియాంకలు రేపటి నుంచి సంగారెడ్డిలో నిర్వహించే 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాండు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ. రమేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పాండు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, జిల్లా టెక్స్‌బుక్స్ ఇన్‌చార్జ్ నర్సింహులు, ఉపాధ్యాయులు మనీ, అరుణ, తులసి, శివ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన

**మన్ననూర్:** స్థానిక పీటీజీ పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఆవరణలో సీపీఆర్‌పై బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్‌రెడ్డి సూచన మేరకు ఏఓ జాఫర్ ఉసేన్ సమక్షంలో వైద్యాధికారులు అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని ప్రత్యక్ష పద్ధతిలో చూపించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గుండెలో సమస్య తలెత్తితే తక్షణమే సీపీఆర్ చేస్తే ప్రమాదం నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయన్నారు. అదేవిధంగా పరిశుభ్రత దినోత్సవంను పురస్కరించి అపోలో ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, సుధాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, రవిందర్, సత్యనారాయణ, ఉసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

### ముమ్మరంగా వాహనాల తనిఖీ

**లింగాల:** మండలంలోని బాకారం–కోమటికుంట చౌరస్తాలో బుధవారం పోలీసులు, జిల్లా ఏఎస్‌టీయూ సీసీఎస్ శాఖ సంయుక్తంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాలలో పత్తి చేల పనులకు విద్యార్థులు వెళ్తనట్లు గుర్తించారు. విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించి స్వగ్రామాలకు తిప్పి పంపించారు. వాహనాలలో సామర్థ్యానికి మించి కూలీలను తరలిస్తున్న డ్రైవర్లను హెచ్చరించారు. జిల్లా ఏఎస్‌టీయూ సీసీఎస్ సీఐ శంకర్, లింగాల ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు, షీ టీమ్ ఎస్‌ఐ రజిత, ఏఎస్‌ఐ విజయలక్ష్మి, హెచ్‌సీ పద్మ, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్, జాకీర్ ఉస్సేన్ పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం వడ్డించాలి

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం పెట్టడంతో విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీగౌడ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ యాదవ్, హరికృష్ణ, అరబిందో, శివరాం, సిద్ధార్థ, తేజ, వీర విద్యార్థినులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాంకు ఘన నివాళి



తిమ్మాజిపేటలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

**సాక్షి, నెట్‌వర్క్:** జిల్లా వ్యాప్తంగా బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని హెచ్‌ఎం లత పేర్కొన్నారు. అదేవిధంగా విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో రాధాకృష్ణ భవనంలో కలాం జయంతి వేడుకలు ఏర్పాటు చేశారు.

- తాడూరు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో కలాం విగ్రహానికి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- తిమ్మాజిపేటలో జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలో ఉన్న కలాం విగ్రహానికి ఎంఈఓ సత్యనారాయణశెట్టి, రాష్ట్ర టెలికాం బోర్డు సభ్యులు శ్రీనివాస్‌బహదూర్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- బల్మూరు మండలం కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు.
- అదేవిధంగా కొల్లాపూర్, అచ్చంపేట, వెల్దండలో వక్తలు మాట్లాడుతూ దేశానికి కలాం చేసిన సేవలను కొనియాడారు.



వెల్దండలో



నాగర్‌కర్నూల్‌లో ...

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని గుండూరు విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని గుండూరు, లింగసానిపల్లి, ముకురాల, పంజుగులలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### పంటలను పరిశీలించిన అధికారులు


**కొల్లాపూర్ రూరల్:** మండలంలోని ముక్కిడిగుండం ,గేమ్యానాయక్ తండాలో మండల వ్యవసాయ అధికారి చిన్న ఉస్సేన్ వరి పంట, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మినుము పంటలలో సోకిన తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు బాలపీరు, మహేష్, బాలు నాయక్, శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



**కొల్లాపూర్:** పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు డి.శేఖర్ కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనాలు వండే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. వంటలు చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, నితీష్, తరుణ్ ఉన్నారు.

### యువత ఉపాధికి కృషి



**కల్వకుర్తి రూరల్:** యువత ఉపాధికి టాస్క్ కృషి చేస్తుందని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాదులోని టాస్క్ కార్యాలయంలో కొంతమంది యువతీ యువకులను 6 నెలల పాటు 360 డీజీ టీఎంజీలో శిక్షణకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, అనలిస్ట్, డిజిటల్ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్ సిన్హా పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**కోడేరు:** మండలంలోని గుండ్యవాల్యానాయక్ తండాకు చెందిన లావుడ్య ధర్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.34వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం లబ్ధిదారుడికి మాజీ ఎంపీటీసీ పార్వతి చెక్కు అందజేశారు. కర్లునాయక్, తులసిరాం, బొజ్యా, బీమా, చంద్రు, తుకారం, భాస్కర్, విజయ్, సక్రు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

**తెలకపల్లి:** మండలంలోని గడ్డంపల్లికి చెందిన కాకునూరి శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

**ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయాలి**

**తాడూరు:** స్థానిక సంస్థ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తేయాలని బీసీ నాయకులు వెంకట్‌నారాయణ, శ్రీనివాసులు, డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముగ్గురు పిల్లల నిబంధనతో బీసీలు రాజకీయాల్లో రాణించలేకపోతున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, సాంబశివుడు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

**బాధితులకు ఫోన్లు అప్పగింత**

**బల్మూర్:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు తొమ్మిది నెలల కిందట ఫోన్లు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజేందర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. బుధవారం మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు ఎస్‌ఐ ఫోన్లను అందజేశాడు. దీంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

**ట్రాక్టర్ బోల్తా: త్రుటిలో తప్పిన ప్రమాదం**

**లింగాల:** మండల కేంద్రం నుంచి తెలకపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో మాడాపూర్ బస్‌స్టేజీ దగ్గర బుధవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. అవుసలికుంటకు చెందిన ట్రాక్టర్ లింగాల వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాలకు దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకాడు. డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

**పాఠశాలలకు ప్రశ్నాపత్రాల పంపిణీ**

**లింగాల:** త్వరలో నిర్వహించే ఎస్‌ఏ–1 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను బుధవారం ఎమ్మార్సీలో మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అందజేశారు. అనంతరం మండలంలోని మగ్దూంపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శ్రీనివాసులు, హరిలాల్, విష్ణు, రవివర్మ తదితరులు ఉన్నారు.

**బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి**



**అచ్చంపేట రూరల్:** బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శంకర్ కోరారు. పట్టణంలోని పలు కిరాణా దుకాణాలను పరిశీలించారు. కిరాణా దుకాణాల్లో బాణాసంచా అమ్మొద్దన్నారు. నిర్దేశించిన ప్రదేశంలోనే అమ్మాలని నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

**సంతకాల సేకరణ**

**వెల్దండ:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, మోతిలాల్, వెంకటయ్యగౌడు, రషీద్, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

**రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఫౌజియా**

**కందనూలు:** రాష్ట్రం గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో గణితం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కోడేరు మండల కేంద్రానికి చెందిన ఫౌజియాను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

**తాళం వేసిన ఇంట్లో చోరీ: కేసు నమోదు**

**వెల్దండ:** మండలంలోని కొట్ర రెవెన్యూ శివారులోని కేసీఆర్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న కల్వకుర్తి చెందిన రాచమల్ల ఆంజనేయులు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం బుధవారం ఆంజనేయులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళం విరగొట్టి ఇంట్లో ఉన్న 7 మాసాల బంగారు ఆభరణాలు, 19 తులాల వెండి, కొంత నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**అచ్చంపేట రూరల్:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పులిజాలకు చెందిన వెంకటయ్య(48) ఈ నెల 10న అచ్చంపేటలో కూలీ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అచ్చంపేట, హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**వీసీ సజ్జనార్‌కు ఆహ్వాన పత్రిక అందజేత**

**అచ్చంపేట రూరల్:** అచ్చంపేటలో నవంబర్ 16న నిర్వహించే సామూహిక వివాహాల కార్యక్రమానికి బుధవారం హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్‌ను నిర్వాహకుడు కౌన్సిలర్ అప్ప శివ ఆహ్వానించారు. ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో పదర మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబునాయక్, వెన్ను కాశీనాథ్ పాల్గొన్నారు.

**దుండగులను శిక్షించాలి**



**తెలకపల్లి:** శివలింగాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఆలేరులో బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో హిందు సంఘాలు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ హిందువులందరు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు, ఈశ్వరయ్య, శ్రీను, కృష్ణ, రవి, రవీందర్‌రావు, నారా యణరెడ్డి, బాబు సాగర్, కృష్ణయ్య, శివయ్య, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

**26న సామూహిక వివాహాలు**

**అచ్చంపేట రూరల్:** పట్టణంలోని వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 26న 111 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు నిర్వహిస్తునట్లు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వర్కర్లకు న్యాయం చేయాలి

**మన్ననూర్:** గిరిజన ఆశ్రమ, సంక్షేమ వసతి గృహాల్లో రోజువారీ వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం డివిజన్ కార్యదర్శి పెర్ముల గోపాల్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న 72 గంటల నిరవధిక సమ్మె చివరి రోజు (బుధవారం) సీఐటీయూ, సీపీఐ తరుపున మద్దతు ప్రకటించారు. అధికారులు స్పందించి జేఏసీ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. చివరిరోజు వర్కర్లు మన్ననూర్–అమ్రాబాద్ ప్రధాన రహదారిలో వంటావార్పు నిర్వహించి రోడ్డుపైనే భోజనాలు చేశారు.

**సమస్య పరిష్కారానికి కృషి**

గిరిజన ఆశ్రమ, సంక్షేమ వసతి గృహాల్లో రోజువారి వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కతో మాట్లాడుతానని వర్కర్లకు హామీ ఇచ్చారు. నిరవధిక సమ్మె శిబిరానికి చేరుకొని ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులతో చర్చించారు. వర్కర్ల జీతాలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ అచ్చంపేట డివిజన్ కార్యదర్శి పెర్ముల గోపాల్, జేఏసీ నాయకులు పృథ్వీరాజ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ యూసూఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, గిరిజన సంఘం నాయకులు రవి, శంకర్ నాయక్, సురేందర్, భరత్, బాలకృష్ణ, మల్లేష్, శివ, ఓం ప్రకాష్, పర్వతాలు, పద్మ, అంజమ్మ, సురేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# కిరాణ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

**కోడేరు:** కిరాణ షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ హన్మంతు హెచ్చరించారు. ఈ నెల 11న 'కిరాణ షాపుల్లో మద్యం అమ్మకాలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రిలో వార్త ప్రచురితం అయింది. దీనికి ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి స్పందించి బుధవారం దాడులు నిర్వహించారు. ఒకరిని తహసీల్దార్ విజయ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దస్తగిరి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ హన్మంతు

### వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలి

**పెద్దకొత్తపల్లి:** మండలంలోని వెన్నచర్లలో మంగళవారం రైతులకు ఉచితంగా అందజేసిన వేరుశనగ విత్తనాలతో పాటు రైతుల వద్ద నుంచి అడవితల్లి స్వచ్ఛంద సంస్థ సభ్యత్వం కోసం ఒక్కొక్క రైతు వద్ద రూ.2100 వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వెన్నచర్లలో కొల్లాపూర్ ఏడీఏ చిన్న హుస్సేన్, వ్యవసాయ అధికారి శిరీషలతో వారు సమావేశం అయ్యారు. ఎంతమంది రైతులు డబ్బులు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. సంస్థ నుంచి గురువారం రైతులకు డబ్బులు ఇస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఎంపీటీసీ రవికుమార్, చిన్నయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

### ఉపాధి పనుల ప్రణాళికను సిద్ధం చేయాలి

**తిమ్మాజిపేట:** ఉపాధిహామీ పనుల ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను మండలంలోని ప్రతి గ్రామంలో విధిగా గ్రామ సభ నిర్వహించాలని ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించి ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామంలో పరిశుభ్రంగా చూసుకోవలన్నారు. సమావేశంలో ఏపీఓ సత్యనారాయణ, కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



అమ్రాబాద్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి



తాడూరులో



వెల్దండ మండలం కొట్రలో

**సాక్షి, నెట్‌వర్క్:** పశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లిలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాడూరు, అమ్రాబాద్, వెల్దండ, తిమ్మాజిపేట, చారకొండ, బల్మూర్ మండలం జినుకుంట, పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో ప్రవీణ్‌కుమార్, వల్యాయి రాజు, శ్యాంసుందర్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, శివకుమార్, అనీల్, మానికలు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞానశేఖర్, నాయకులు రాజేందర్, అనంతరెడ్డి, నర్సింహారావు, నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మొగులాన్‌గౌడ్, పశు వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.